ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు

ధర్పల్లి, అక్టోబర్ 15: మండల కేంద్రంలో ఉన్న శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఆర్టీసీ మాజీ చైర్మన్, రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాజిరెడ్డి వెంట మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, మాజీ ఎంపీపీ నల్ల సారికా హన్మంత్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

జిల్లా కవికి పురస్కారం

శంకర్

సుభాష్‌నగర్, అక్టోబర్15: జిల్లా కేంద్రం పెద్దబజార్‌కు చెందిన కవి చెన్న శంకర్ సోమవారం సహస్ర మధుర కవి భూషణ పురస్కారం అందుకున్నారు. విజయదశమి సందర్భంగా దేవి నవరాత్రుల్లో దేవి వివిధ రూపాలు, భక్తి వికాస మార్గాలు తదితర అంశాలపై పెద్దపల్లి జిల్లాకు చెందిన మేఘన సాహితీ కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు ఈర్ల సమయ్య రూపొందించిన నూతన తెలుగు లఘు కవితాప్రక్రియ మధురిమలులో సహస్ర కవితలు రచించిన చెన్న శంకర్‌కు ఈ పురస్కారాన్ని అందజేసి అభినందించారు.

విలీన సభ పోస్టర్ల ఆవిష్కరణ

డిచ్‌పల్లి/నవీపేట/ వేల్పూర్, అక్టోబర్ 15: ఐఎఫ్‌టీయూను టీయూసీఐలో విలీనం చేస్తూ ఈనెల 20న హైదరాబాద్‌లో సభ నిర్వహించనున్నారు. ఈ సభ పోస్టర్లను డిచ్‌పల్లి మండల కేంద్రంలో మంగళవారం ఆవిష్కరించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకన్న మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం పదేండ్లుగా కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నదని విమర్శించారు. వీటిని తిప్పికొట్టడానికి బలమైన కార్మిక ఉద్యమ నిర్మాణం అవసరమన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు మురళి, కార్మికులు గణేశ్, ధర్మపురి శ్రీనివాస్, ప్రవీణ్, ఇంతియాజ్, రమేశ్, గంగాధర్, సాయి బాబా, ఖాజా పాల్గొన్నారు. నవీపేట మండల కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.రాజేశ్వర్,జీపీ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. వేల్పూర్ మండలంలోని అమీనాపూర్ గ్రామంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు ఇస్తారి రమేశ్, జ్యోతి, పద్మ, ప్రభావతి, యేసుమణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కలాం జయంతి

మోర్తాడ్/భీమ్‌గల్/సిరికొండ, అక్టోబర్ 15 : మండల కేంద్రంలో మండల దళిత సంక్షేమసంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఏపీజే అబ్దుల్‌కలాం 96వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవల గురించి కొనియాడారు. కార్యక్రమంలో మల్లూరిరాజారాం, జాంభవ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. భీమ్‌గల్ పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సిరికొండ సత్యశోధక్ పాఠశాలలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

కమ్మర్‌పల్లి జడ్పీ ఉన్నత పాఠశాల టెన్త్ 2001-02 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం కమ్మర్‌పల్లిలోని పద్మశాలీ కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. పూర్వ గురువులను సన్మానించారు. డిచ్‌పల్లి మండలం

రాంపూర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి 2008-09 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం ఆపాఠశాలలో నిర్వహించారు. పూర్వ గురువులను సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. - మోర్తాడ్, డిచ్‌పల్లి, అక్టోబర్ 15

త్వరలో జిల్లాకు 63 కొత్త బస్సులు

రామడుగు ప్రాజెక్టులో చేప పిల్లలు వదులుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

- **రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి**
- **రామడుగు ప్రాజెక్టులో చేప పిల్లల విడుదల**

ధర్పల్లి, అక్టోబర్ 15: జిల్లాకు అదనంగా 63 ఆర్టీసీ బస్సులు వస్తాయని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రామడుగు ప్రాజెక్టులో ఎమ్మెల్యే చేప పిల్లలను విడుదల చేశారు. రామడుగులో పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్నదన్నారు. మత్స్యకారులకు లైట్ జాకెట్లను సీడీపీ నిధుల నుంచి అందిస్తామన్నారు. అనంతరం ధర్పల్లిలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి రేణుకా ఆలయంలో వార్షికోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, నాయకులు చెలిమెల శ్రీనివాస్, సురేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు, ఉద్యోగులతో గల్ఫ్ కార్మికులు, తండాపెద్దలు

విద్యార్థులకు సన్మానం

ధర్పల్లి, అక్టోబర్ 15: మండలంలోని నడిమి తండా గ్రామపంచాయతీ పరిధిలోని పదో తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులు, 2024-25లో ఉద్యోగం సాధించిన వారికి తండాకు చెందిన గల్ఫ్ కార్మికుల ఆధ్వర్యంలో ఘనసన్మానం చేశామన్నారు. మంగళవారం గల్ఫ్ కార్మికులు, తండావాసులు కలిసి విద్యార్థులు, ఉద్యోగులను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో గల్ఫ్ కార్మికులు శంకర్, వినోద్, రాంచందర్, విజయ్, నరేందర్, గోపి, రాజు పాల్గొన్నారు.

జీవాలకు గాలికుంటు నివారణ టీకాలు

బొప్పాపూర్‌లో టీకాలు వేస్తున్న డాక్టర్

రుద్రూర్/ పోతంగల్(కోటగిరి)/ జక్రాన్‌పల్లి/ ఆర్మూర్‌టౌన్, అక్టోబర్15: రుద్రూర్ మండలం బొప్పాపూర్‌లో జీవాలకు మంగళవారం గాలికుంటు టీకాలను డాక్టర్ సంతోష్ వేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో జీవాలకు టీకాలు వేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నారోజీ గంగారాం, బాపూజి లింగం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. కోటగిరి మండలం వల్లభాపూర్‌లో జీవాలకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి సురేశ్ తెలిపారు. వచ్చే నెల 14వరకు టీకాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. వైద్యులు సుదీర్‌గౌడ్, గోపాల మిత్ర తుకారాం, సిబ్బంది పాల్గొన్నారు. జక్రాన్‌పల్లి మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో 535 గేదెలు, 152 ఆవులకు టీకాలు వేసినట్లు జూనియర్ వెటర్నరీ అధికారిణి శశిరేఖ తెలిపారు. పశు వైద్యసిబ్బంది అనిల్, రాజ్‌కుమార్, పద్మారావు, పాడి రైతులు పాల్గొన్నారు. ఆర్మూర్ మండలంలోని మగ్గిడి గ్రామం లో గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమం నిర్వహించినట్లు పశు వైద్యాధికారి లక్కం ప్రభాకర్ తెలిపారు.

అంతర్జాతీయ ఉషూ పోటీలకు పాల్దా విద్యార్థి

సారంగాపూర్/ఖలీల్‌వాడి, అక్టోబర్ 15: పాల్దా గ్రామానికి చెందిన తాడూరి ఉదయ్ కుమారుడు తాడూరి దీక్షిత్ అంతర్జాతీయ స్థాయి ఉషూ పోటీలకు ఎంపికయ్యాడు. ప్రెసిడెన్సీ హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న దీక్షిత్ ఇటీవల కర్ణాటకలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 17 నుంచి 22 వరకు జార్జియా దేశంలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్నాడు. రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ధర్పల్లి మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ నిజామాబాద్‌లోని వారి నివాసంలో మంగళవారం క్రీడాకారుడిని అభినందించారు. బాజిరెడ్డి క్రీడాకారుడికి స్వీటు తినిపించి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో జలాల్‌పూర్ బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, క్రీడాకారుడి తండ్రి తాడూరి ఉదయ్ పాల్గొన్నారు. ఈనెల 17 నుంచి 27 వరకు జార్జియా దేశంలోని బటోమిలో నిర్వహించనున్న అంతర్జాతీయ ఉషూ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో నిజామాబాద్ విజయ్ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థిని ఆకాంక్ష రాష్ట్రం తరఫున పాల్గొననుంది. ఎంపికైన విద్యార్థినిని కోచ్ అబ్దుల్ ఉమేర్‌ను విజయ్ హైస్కూల్ వ్యవస్థాపకురాలు అమృతలత, ప్రభాదేవి అభినందించారు.

వరికోతలపై అవగాహన ఉండాలి

సారంగాపూర్, అక్టోబర్ 15: జిల్లాలోని రైతులు వరికోతలపై అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయశాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి కృష్ణ సూచించారు. మంగళవారం రైతు నేస్తంలో భాగంగా గుండారం రైతువేదిక భవన్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అవగాహన కల్పించారు. ఏవోలు, ఏఈవోలు ప్రత్యేక శ్రద్ధ చూపి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి హీరాజాదవ్, గుండారం సొసైటీ చైర్మన్ దాసరి శ్రీధర్, ఏఈవోలు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

ఆర్మూర్‌టౌన్, అక్టోబర్15 : ఈ నెల 18న నిర్వహించనున్నట్లు సీపీఎం ఏరియా మహాసభను విజయవంతం చేయాలని సీపీఎం నాయకుడు వెంకటేశ్ కోరారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్మూర్‌లో జరిగే ఈ మహాసభలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పలడుగు భాస్కర్, జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు హాజరు కానున్నట్లు తెలిపారు.

సంక్షిప్తంగా..

- **చర్యలు తీసుకోవాలి** - ధర్పల్లి, అక్టోబర్ 15: మండల కేంద్రంలోని పేదల భూములను ఆక్రమించుకుని అమ్ముకున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు మంగళవారం తహసీల్దార్ మాలతికి వినతిపత్రం సమర్పించారు. ఆర్టీసీ స్థలాన్ని తప్పుడు పత్రాలు చూయించి దళితుడైన నారాయణ వద్ద రూ.పది లక్షలు తీసుకుని నమ్మించి మోసం చేసిన వారిపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు రాజు, బాలయ్య పాల్గొన్నారు.
- **రైతులకు అవగాహన** -ఇందల్వాయి, అక్టోబర్ 15: ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం రైతులకు సదస్సు నిర్వహించారు. బ్యాంకు మేనేజర్ రావుల సంతోష్‌కుమార్ వివిధ రుణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాసెసింగ్ ఆఫీసర్ దీపిక, క్యాషియర్ శ్రీలేఖ, రైతులు పాల్గొన్నారు.
- **అంబులెన్సుల తనిఖీ**- ఖలీల్‌వాడి, అక్టోబర్ 15: 108, 102, 1962 అంబులెన్సులను నిర్వహణ ఎస్‌సీఎం హెడ్ సత్యనారాయణ మంగళవారం తనిఖీ చేశారు. 108, 102, 1962 ఎఫ్‌హెచ్‌ఎస్ జిల్లా ఇన్‌చార్జి శ్రీకాంత్, 108 సిబ్బంది సంతోష్‌రెడ్డి, రాజు, రాజయ్య, ఎఫ్‌హెచ్‌ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.
- **ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి**- ఖలీల్‌వాడి, అక్టోబర్ 15: పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని ఎన్‌ఆర్ భవన్ కోటగల్లి ఆఫీస్‌లో మంగళవారం ఆసంఘం ప్రధాన కార్యదర్శి ఆనంద్ విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో నాయకులు నరేందర్, గణేశ్, అనిల్ పాల్గొన్నారు.
- **న్యాయం చేయాలి** - ఖలీల్‌వాడి, అక్టోబర్ 15: జూనియర్ వైద్యురాలిపై లైంగికదాడి, హత్య కేసులో న్యాయం చేయాలని కోరుతూ జూనియర్ డాక్టర్లు నిర్వహిస్తున్న పోరాటానికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నిజామాబాద్ ఆధ్వర్యంలో వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి మంగళవారం సంఘీభావం తెలిపారు. వైద్యులు దామోదర్ రావు, కొట్టూర్ శ్రీశైలం, విశాల్, రవీంద్రనాథ్, జీవన్‌రావు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.
- **ఆత్మీయ సమ్మేళనం**- వినాయక్‌నగర్, అక్టోబర్15: నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ఆత్మీయ సమేళనం నిర్వహించారు. ఎంపీ ధర్మపురి అర్వింద్, అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.
- **ఎంపీ అర్వింద్‌కు తల్వార్ బహూకరణ** - సుభాష్‌నగర్, అక్టోబర్ 15: గురుద్వార్ ప్రబంద్ కమిటీ మాజీ అధ్యక్షుడు సర్దార్ దర్శన్‌సింగ్ బృందం మంగళవారం ఎన్జీవోస్ కాలనీలో ఎంపీ అర్వింద్‌కు ఆయన నివాస గృహంలో తల్వార్‌ను బహూకరించి అభినందించారు. విజయానికి ప్రతీకైన విజయదశమిని పురస్కరించుకొని దానిని బహూకరించడం గురుద్వార్ ప్రబంధ కమిటీ సంప్రదాయమని దర్శన్ సింగ్ అన్నారు.
- **పోలింగ్ కేంద్రాల పరిశీలన** - మోర్తాడ్, అక్టోబర్ 15 : కమ్మర్‌పల్లి మండలంలోని ఆర్‌ఆర్‌నగర్, ఉప్లూర్, బషీరాబాద్, కోనాసముందర్, చౌట్‌పల్లి గ్రామాల్లో గతంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో రాజశ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు.
- **లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణం**- డిచ్‌పల్లి, అక్టోబర్ 15: మండల కేంద్రంలోని 7వ బెటాలియన్‌లోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం వివిధ పూజలు నిర్వహించారు. అలివేలు మంగ సమేత లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.
- **రుద్రూర్‌లో చెక్‌పోస్టు ప్రారంభం**- రుద్రూర్, అక్టోబర్15: మండల కేంద్రంలో వర్ని ఏఎంసీ చైర్మన్ సురేశ్‌బాబాతో కలిసి ఆగ్రో ఇండస్ట్రీ చైర్మన్ కాసుల బాలరాజు మంగళవారం చెక్‌పోస్టును ప్రారంభించారు. అంతకు ముందు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నారోజి గంగారాం, తహసీల్దార్ తారాబాయి, విండో చైర్మన్ సంజీవ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

మోర్తాడ్, అక్టోబర్ 15 : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మంగళవారం ప్రాజెక్ట్‌లోకి 8507 క్యూసెక్కుల వరద వచ్చింది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091అడుగులు(80.5టీఎంసీలు) కాగా, ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1091అడుగుల (80.501టీఎంసీలు) నీటినిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయకాలువకు 4917 క్యూసెక్కులు, సరస్వతీకాలువకు 500 క్యూసెక్కులు, వరదకాలువకు 2వేల క్యూసెక్కులు, మిషన్‌భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

ఏర్గట్ల, అక్టోబర్ 15 : మండలంలోని గుమ్మిర్యాల్ గ్రామానికి చెందిన పసుల భరత్‌కు ఏర్గట్ల పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రాములు మంగళవారం ఫోన్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. భరత్ ఇటీవల తన ఫోన్ ఎక్కడో పోయిందని వెంటనే పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వెతికి భరత్‌కు సమాచారమిచ్చి ఫోన్ అందజేశామన్నారు. ఫోన్లు వినియోగించే వారు ప్రయాణ సమయంలో కాని, ఇతర సమయంలో కాని జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు.

బదిలీపై వెళ్లిన పోలీస్‌లకు సన్మానం

నవీపేట, అక్టోబర్ 15 : నవీపేట పోలీస్ స్టేషన్‌లో దీర్ఘ కాలం పనిచేసి బదిలీపై వెళ్తున్న ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు మల్లేశ్, అశోక్‌తోపాటు కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను మంగళవారం ఇన్‌చార్జి ఎస్సై యాదగిరిగౌడ్, ఏఎస్సై గఫర్, తోటి సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏఎస్సై గఫర్ మాట్లాడుతూ కొంత కాలంగా నవీపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన మల్లేశ్, అశోక్ ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఎడపల్లి, అక్టోబర్ 15 : మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్‌పాడ్ గ్రామానికి చెందిన గడ్డం గంగాధర్ (57) సోమవారం రాత్రి కాలకృత్యాలకు గ్రామానికి చెందిన చెరువుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడ్డాడు. ఎంతకీ ఇంటికి రాకపోయేసరికి కుమారుడు గిరిప్రసాద్ వెళ్లి చూడగా చెరువులో మునిగి ఉండడాన్ని గమనించి గ్రామస్తులతో కలిసి బయటికి తీసి బోధన్ దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. కుమారుడు గిరిప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

నందిపేట్, అక్టోబర్ 15 : మాక్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధి లోని మానిక్‌భండార్ చౌరస్తా వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మోటారు సైకిల్‌పై వెళుతున్న జంగంపల్లి బాబురావు(39) మంగళవారం ఢీకొట్టగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్సై గంగాధర్ తెలిపారు. మృతుని భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బైక్ అదుపు తప్పి మరొకరు..

ఆర్మూర్‌టౌన్, అక్టోబర్15 : ఆలూర్ మండలంలోని మచ్చర్ల శివారులో బైక్ పై వెళ్తూ విద్యుత్ స్తంభానికి ఢీ కొన్న ఘటనలో మర్ల చిన్నయ్య మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మచ్చర్ల గ్రామానికి చెందిన చిన్నయ్య తన బైక్‌పై వన్నెల్ కే గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన చిన్నయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. మృతుడికి భార్య రంజిత, ఇద్దరు పిల్లలున్నారు.

యువకుడిని కాపాడిన పోలీసులు

సిరికొండ, అక్టోబర్15: మండల కేంద్రానికి చెందిన శ్రీమంతుల భానును మంగళవారం పోలీసులు కాపాడారు. ఎస్సై రామ్ కథనం ప్రకారం.. భాను కుటుంబ సభ్యులతో గొడవపడి ఇంటినుంచి వెళ్లిపోయాడు. ఆయన సోదరుడు సాయిచరణ్ ఎస్సైకి ఫిర్యాదు చేయడంతో ఫోన్ నంబర్ ఆధారంగా లొకేషన్ గుర్తించారు. పందిమడుగు గ్రామ శివారులో అడవిలో ఉన్న యువకుడి వద్దకు పోలీసులు వెళ్లగా అప్పటికే పురుగులమందు తాగాడు. చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు.

'రిజర్వేషన్ల ఎత్తివేసేందుకు కుట్ర'

ఖలీల్‌వాడి, అక్టోబర్ 15: ఎస్సీ రిజర్వేషన్ల ఎత్తివేసేందుకు కుట్రలో భాగమే ఎస్సీ వర్గీకరణ అని ఎస్సీ మాల సంఘం నాయకులు అన్నారు. నగరంలోని పోచమ్మగల్లీలో మంగళవారం సమావేశాన్ని నిర్వహించినట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పులి జైపాల్, నీలగిరి చందు తెలిపారు. ఎస్సీ వర్గీకరణతో ఎస్సీల ఉనికి కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు.

జిల్లా సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ బాలికల ప్రాబబుల్స్ జట్టు ఎంపిక

ఎంపికైన జట్టు

డిచ్‌పల్లి, అక్టోబర్ 15: సుద్దపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం జిల్లా సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ బాలికల ప్రాబబుల్స్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించినట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మార్కంటి గంగామోహన్ తెలిపారు. ఎంపికైన 30 మంది క్రీడాకారులకు ఈనెల 17 వరకు శిక్షణ శిబిరం నిర్వహించి తుది జట్టును ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఈనెల 18 నుంచి 20 వరకు వరంగల్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు వారిని పంపనున్నట్లు తెలిపారు.

పోలీసు స్టేషన్‌కు ఇసుక టిప్పర్ తరలింపు

ఎడపల్లి, అక్టోబర్ 15 : మండల కేంద్రంలో బోధన్ నుంచి నిజామాబాద్ వైపునకు వెళ్తున్న ఇసుక టిప్పర్, 2 ట్రాక్టర్లను బోధన్ తహసీల్దార్ ఇచ్చిన సమాచారం మేరకు ఎడపల్లిలో ప్రధాన రహదారి పై మంగళవారం పట్టుకొని అనుమతి పత్రాలు అడుగగా పత్రాలు చూపకపోవడంతో ఎడపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇసుక టిప్పర్ బోధన్‌కు చెందిన సయ్యద్ సుల్తాన్, 2 ట్రాక్టర్లు హున్సాకు చెందినవని, ఎవరైనా ఇసుక, మొరం అనుమతులు లేకుండా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

గ్రంథాలయంలో చదివిన 20 మందికి ఉద్యోగాలు

ఆర్మూర్‌టౌన్, అక్టోబర్ 15 : పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయ ఆవరణలో ఉన్న గ్రంథాలయానికి వచ్చి డీఎస్సీకి ప్రిపేర్ అయిన 20 మంది అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారని లైబ్రేరియన్ వరలక్ష్మి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయానికి ఎక్కువ మంది పాఠకులు వస్తున్నారని, పోటీ పరీక్షలకు సంబంధించిన అన్ని రకాల మెటీరియల్స్ అందుబాటులో ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. పాఠకులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు

నవీపేట, అక్టోబర్ 15 : మండలంలోని 32 జీపీల్లో మంగళవారం ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసినట్లు మండల ఎంపీవో రామకృష్ణ తెలిపారు. కమిటీ లో గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ చైర్మన్‌గా పంచాయతీ కార్యదర్శి ఐదుగురు సభ్యులు ఉంటారని అన్నారు.

ఎగ్జిబిషన్ నిర్వాహకులపై కేసు నమోదు

శక్కర్‌నగర్, అక్టోబర్ 15 : బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కొనసాగుతున్న ఎగ్జిబిషన్ నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. పట్టణంలోని శక్కర్‌నగర్ ప్రాంతానికి చెందిన కొందరు ఎగ్జిబిషన్‌కు వచ్చిన సందర్భంగా వారితో చిన్నపాటి గొడవతో వారిపై నిర్వాహకులు అల్తాఫ్ అతని తండ్రి దాడికి పాల్పడ్డారన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా వారిని పిలిపించి ప్రశ్నించే క్రమంలో అల్తాఫ్ అతని తండ్రి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుళ్లను నెట్టివేయడంతో పాటు న్యూసెన్స్‌కు పాల్పడ్డారని, వారిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపామన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★I, SOMA AMRUTHA, R/o. H.No. 4-67/10, Nagampet, Balkonda, Nizamabad. I have changed name/ Surname as RAMPURAM AMRUTHA
NTZ-334480

CHANGE OF NAME
★I, SRI NARSUBAI, R/o. H.No.6-2, Ankapur, Armoor, Nizamabad. I have changed name/ Surname as SRIRAM NARSUBAI
NTZ-334480

CHANGE OF NAME
★I, SOMA GANGAREDDY, R/o. H.No.4-67/10, Nagampet, Balkonda, Nizamabad. I have changed Name/ Sur name as RAMPURAM GANGAREDDY
NTZ-334480

CHANGE OF NAME
★I, MADUPU GANGAREDDY, R/o. H.No. 10-57, Venkateshwara Colony, Mamidipally, Armoor, Nizamabad. I have changed Name/ Surname as MADUPU CHINNA GANGAREDDY
NTZ-334480

CHANGE OF NAME
★I, SRI SANTOSH KUMAR, R/o. H.No.6-2, Ankapur, Armoor, Nizamabad. I have changed Name/ Surname as SRIRAM SANTOSH KUMAR
NTZ-334480

CHANGE OF NAME
★I, SRI NARSAIAH, R/o. H.No. 6-2, Ankapur, Armoor, Nizamabad. I have changed Name/ Surname as SRIRAM NARSAIAH
NTZ-334480

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు

ఎడపల్లి, అక్టోబర్ 15 : దసరా తర్వాత ఎడపల్లిలో సద్దుల బతుకమ్మ పండుగను నిర్వహించడం ప్రత్యేకత. సంప్రదాయాలతో తెలంగాణ వాసులు జరుపుకొనే పండుగల్లో బతుకమ్మ పండుగ ప్రధానమైనది. మంగళవారం ఉదయం నుంచి తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి సాయంత్రం వరకు ఆడి పాడి బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం మొదటగా దేశ్‌ముఖ్ గడి నుంచి ప్రారంభమైన బతుకమ్మ వేడుకలు పెద్ద ఎత్తున మహిళలు దాస్ హనుమాన్, వీరహనుమాన్, గోవింద్‌పూర్ హనుమాన్‌ల వద్ద ప్రధాన కూడళ్లలో బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ వేడుకలను నిర్వహించారు. అనంతరం ఇందిరమ్మ కాలనీలో ఉన్న బతుకమ్మ చెరువులో బతుకమ్మలను మహిళలు నిమజ్జనం చేశారు. తమ వెంట తెచ్చుకున్న తినుబండారాలను ఆరగించారు. ఎడపల్లి బతుకమ్మ వేడుకల లో పురుషులు పాల్గొనడం ఇక్కడ ప్రత్యేకత.


ఎడపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

అతిథి అధ్యాపక ఫిజికల్ డైరెక్టర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నందిపేట్, అక్టోబర్ 15 : తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ పోస్ట్ ఖాళీగా ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్ ధాత్రిక వెంకటేశ్వర్ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో ఎంపీఎడ్‌లో 55 శాతం మార్కులు సాధించిన వారు అర్హులన్నారు. తాత్కాలిక పద్ధతిన పని చేయుటకు ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను తీసుకుని ఈనెల 16న ఉదయం 10.30 గంటలకు కళాశాలకు రావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

విద్యార్థుల కళా ఉత్సవం

ఆర్మూర్‌టౌన్, అక్టోబర్ 15: పట్టణంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో విద్యార్థులకు కళా ఉత్సవ కార్యక్రమం నిర్వహించామని ఎంఈవో రాజగంగారాం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లారు. గెలుపొందిన విజేతలకు రోటరీ క్లబ్ ఆర్మూర్ అధ్యక్షుడు రజనీష్ కిరాడ్ అభినందించి మెమెంటోలను అందజేశారు.

అదనపు బస్సులకే టికెట్ రేట్ల పెంపు

ఆర్మూర్‌టౌన్, అక్టోబర్ 15 : దసరా పండుగ నేపథ్యంలో అదనంగా ఏర్పాటు చేసిన బస్సులకు మాత్రమే టికెట్ ధర పెంచామని ఆర్టీసీ డిపో కార్యాలయ మేనేజర్ రవి కుమార్ తెలిపారు. మంగళవారం డిపో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్మూర్ నుంచి జేబీఎస్‌కు అదనంగా ఏర్పాటు చేసిన బస్సులకు టికెట్ పెంచామని, ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. పెంచిన ధరలకు ఈ రోజు చివరి తేదీ అని పేర్కొన్నారు.

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తొద్దు

బోధన్ రూరల్, అక్టోబర్ 15 : మండలంలో గ్రామాల వారీగా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని బోధన్ ఎంపీడీవో బాలగంగాధర్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో నాలుగు రోజులుగా గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణా తరగతులు కొనసాగుతుండగా ఆయన వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీవో మధుకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనిల్ ఉన్నారు.

నందిపేట్‌లో 150 మందికి పరీక్షలు

నందిపేట్, అక్టోబర్ 15 : మండల కేంద్రంలో హనుమాన్ గల్లీ, రాజ్‌నగర్, దుబ్బ ప్రాంతాల్లో మంగళవారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 150 మంది రోగులను డాక్టర్ ప్రవీణ్ పరీక్షించారు. ఇందులో 20 మందికి డెంగ్యూ, 18 మందికి మలేరియా, 19 మందికి షుగర్ పరీక్షలు చేశారు. నీటి నిల్వ గుంతలలో ఆయిల్ బాల్స్ వేయించారు. శిబిరంలో దేవన్న, పద్మావతి, భాస్కర్, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.